బోనం ఎత్తిన..లష్కర్

- అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ఆలయాలకు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న ఫలహారపు బండ్లు,తొట్టెల ఊరేగింపు

బేగంపేట్/సికింద్రాబాద్/మారేడ్‌పల్లి/అడ్డగుట్ట/బన్సీలాల్‌పేట్, జూలై 21: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవంగా కనుల పండువగా జరిగింది. అమ్మవారికి బోనాల సమర్పణ, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో జాతరను భక్తులు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంతో పాటు సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అమ్మవారి దేవాలయాలు బోనాల సమర్పణతో పాటు భక్తుల సందర్శనతో కిటకిటలాడాయి. సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం మూడున్నర గంటలకు బోనం సమర్పించారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ఆకట్టుకున్న వివిధ రకాల బోనాలు

రాంగోపాల్‌పేట్, మోండా మార్కెట్ డివిజన్‌లో ఆదివారం బోనాల జాతర సాగింది. భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన వివిధ రకాల రూపాలలో తయారు చేసిన బోనాలతో అమ్మవారి ఆలయాలకు తరలి వచ్చారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని సుమారు 15 అమ్మవారి దేవాలయాలలో జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. ప్రధానంగా శివాజీనగర్ డొక్కలమ్మ, రాష్ట్ర పతి రోడ్‌లోని దండు మారెమ్మ, సేయింట్ మేరీస్ రోడ్‌లోని పీనుగుల మల్లన్న, సెకండ్ బజార్‌లోని పోచమ్మ, ముత్యాలమ్మ, కళాసీగూడలోని శ్రీదేవి పోచమ్మ, స్టేషన్ రోడ్‌లోని రేణుక ఎల్లమ్మ, తదతర దేవాలయాలలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

లష్కర్‌లో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల పండుగను పురస్కరించుకొని లష్కర్‌లో ప్రాంతాలన్ని అమ్మవారి నామ స్మరణలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అమ్మవారికి నైవేద్యం సమర్పించే అమ్మవారి తొట్టేల ఊరేగింపు శోభాయమానంగా సాగింది.

ఘనంగా బోనాల ఉత్సవాలు..

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం తెల్లవారు జామున నుంచే మహిళలు బోనం నెత్తిన పెట్టుకొని అమ్మవారికి కల్లు సాక పోసి బోనం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల ఆట, పాటలతో సందడిగా సాగాయి. డివిజన్ పరిధిలోని రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న గండి మైసమ్మ, జూలేశ్వరి దేవి, నల్ల పోచమ్మ, తుల్కలమ్మ , సెకండ్‌బజార్‌లోని ముత్యాలమ్మ, పీనుగుల మల్లన్న, శివాజీనగర్‌లోని డొక్కలమ్మ, ఈదమ్మ మహంకాళి భైరవస్వామి, వైఎంసీఏ ప్రాంతంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో బోనాల ఉత్స వాలు ఘనంగా జరిగాయి.

ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

ఆలయాల్లో పలువురు ప్రముఖుల ప్రత్యేక పూజలు

బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని పలు ఆలయాల్లో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెజిమెంటల్ బజార్ లోని గండి మైసమ్మ ఆలయంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కంటోన్మెంట్ ఐదవ వార్డు మహాత్మాగాంధీనగర్ బస్తీలోని నల్లపోచమ్మ ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో బోర్డు నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ, ప్రముఖ సామాజిక కార్యకర్త తేలుకుంట అరుణ్ జ్యోతి సతీష్ గుప్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దాల నర్సింహ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సికింద్రాబాద్‌లో బోనాల సందర్భంగా ప్రధాన రహదారుల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో వివిధ ప్రాంతాలలో పలువులు భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దేవాలయానికి అను సంధానమైన రహదారులైన రాష్ట్రపతి, మహాత్మ గాంధీ, మోండామార్కెట్, టుబాకో బజార్, ఓల్డ్ బోయిగూడ, రాణిగంజ్, మినిస్టర్‌రోడ్ తదితర ప్రాంతాలలో బస్తీలకు,కాలనీలకు వెళ్లే దారులను పోలీసులు పూర్తిగా బారికేడ్లతో మూసివేశారు. దీంతో స్థానికులు, భక్తులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

టకారబస్తీలోని పద్మారావు నివాసంలో..

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ నివాసంలో బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. అంతేకాకుండా మోండా మార్కెట్, టకార బస్తీలోని ఆయన నివాసంలో పద్మారావు కుటుంబం ఆధ్వర్యంలో ఆదివారం బోనాలు వేడుకలు వైభవంగా నిర్వహించారు. పద్మారావు కుటుంబానికి చెందిన స్థానిక ముత్యాలమ్మ దేవాలయంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి, ఆయన కుటుంబ సభ్యులు బోనాల వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నగర జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్,ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంఎల్‌సీ వాణీదేవి లతో పాటు సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ల కార్పొరేటర్లు హేమ,శైలజ,ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు క్యూ లైన్‌లో ఉన్న మహిళలు

బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మెట్టుగూడ కార్పొరేటర్

మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరిగిన బోనాల వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన ఫలహారపు బండ్ల ఊరేగింపులో ఆమె పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పణ

ప్రతి ఏటా ఆషాఢ మాసంలో జరిగే అమ్మవారి బోనాల జాతరను బన్సీలాల్‌పేట్‌లో ఘనంగా నిర్వహించారు. నల్ల పోచమ్మ దేవాలయం, శ్రీ తాళ్ళ ఎల్లమ్మ, పోచమ్మ ఆలయం, శ్రీ రేణుకా ఎల్లమ్మ, శ్రీ భద్రకాళీ దేవాలయాలలో భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం సమర్పించారు. చాచానెహ్రూనగర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపకుడు బండి శాంతికుమార్ ఆధ్వర్యంలో పోతరాజుల డ్యాన్సుల నడుమ తొట్టెలను ఉజ్జయినీ మహంకాళి దేవాలయం వరకు తీసుకెళ్ళి సమర్పించారు. పద్మారావునగర్‌లోని అమ్మవారి అలయాన్ని బీఆర్ఎస్ నాయకుడు జి.పవన్‌కుమార్ సందర్శించారు. బన్సీలాల్‌పేట్‌లో బీఆర్ఎస్ నాయకుడు కే.లక్ష్మిపతిని పలు దేవాలయాల నిర్వాహకులు ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో సన్మానించారు.


అమ్మవారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఏర్పాట్లపై అక్కడున్న అధికారులను అడిగి తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బోనాల సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆప్యాయంగా తన నివాసానికి తీసుకెళ్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నల్లపోచమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించడానికి వస్తున్న మహిళలు

అమ్మవారికి బోనం సమర్పిస్తున్న సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ కోట నీలిమ

మెట్టుగూడలో బోనాల వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాసూరి సునీత


రెజిమెంటల్‌బజార్‌లోని శ్రీ గండి మైసమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు బాబురావు, అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, జీహెచ్ఎంసీ కో ఆప్షన్ సభ్యుడు సీఎన్. నర్సింహముదిరాజ్

అమ్మవారిని దర్శించుకున్న సికింద్రాబాద్ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, ప్రసన్నలక్ష్మి, చిత్రంలో గోల్నాక కార్పొరేటర్ లావణ్య

రెజిమెంటల్‌బజార్‌లోని గండి మైసమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ


గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబాను దర్శించుకున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, డాక్టర్ సాయికుమార్ బాబా

గురుశిష్యుల బంధం చాలా పవిత్రం

బన్సీలాల్‌పేట్, జూలై 21 : గురుపౌర్ణమి సందర్భంగా పద్మారావునగర్‌లోని డాక్టర్ సాయికుమార్ వ్యాధి నివారణ ఆశ్రమంలో శ్రీసాయి సప్తాహ ఉత్సవాలలో భాగంగా ఆదివారం సద్గురు సాయికుమార్ బాబా ఆధ్వర్యంలో శిరిడి సాయిబాబా విగ్రహానికి 108 గౌక్షీర కలశాలతో మహా కుంభాభిషేకం, పంచఫలరసములతో అభిషేకం, నవగ్రహపూర్వక మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితర ప్రముఖులు సాయిబాబాను దర్శించుకున్నారు. సాయంత్రం జరిగిన వ్యాసపూజ అనంతరం సద్గురు సాయికుమార్ బాబా భక్తులనుద్దేశించి మాట్లాడుతూ వేదవ్యాస మహాముని ఎంతో గొప్ప గురువన్నారు. గురుశిష్యుల బంధం చాలా పవిత్రమైనదన్నారు. ప్రతి ఒక్కరూ గురువులను పూజించాలని, మోక్షం కోసం వారి మార్గాన్ని అనుసరించాలన్నారు.

- బోయిగూడ రైల్వే బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ శిరిడి సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సనత్‌నగర్ బీకేగూడలో ఉన్న సాయిబాబాను దర్శించుకున్న ఎన్‌డీఎంఏ మాజీ వైస్ చైర్మన్, బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత అభినందనీయం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

చెక్కులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట్, జూలై 21 : ఆర్థిక కారణాలతో చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు సనత్‌నగర్ లోని సంకేత్ సంస్థ అందిస్తున్న ఆర్థిక చేయూత ఆదర్శమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ ఈ-లైబ్రెరీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో రూ. 2.30 లక్షలతో 12 మంది విద్యార్థుల చదువులకు అవసరమైన ఆర్థిక చేయూతను అందించే కార్యక్రమానికి ఎమ్మెల్యే తలసాని ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజం పట్ల తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సంకేత్ సంస్థ ప్రతినిధులు సనత్‌నగర్‌పై తమదైన ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో సంకేత్ సంస్థ అధ్యక్షులు మురళి ఫణి, బీఆర్ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, బోగి బాల్‌రాజ్, సురేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, దాడి ప్రవీణ్ రెడ్డి, సంకేత్ సభ్యులు మమత, ధనశ్రీ పాల్గొన్నారు.

నేటితో చేనేత హస్తకళా మేళా ముగింపు



ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 21: హబ్సిగూడలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్, సేల్స్ ప్రదర్శన సోమవారంతో ముగియనుంది. ఈ మేళాకు స్పందన లభిస్తున్న నేపథ్యంలో ప్రదర్శనను ఈ నెల 22 వరకు పొడగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ వివిధ రకాల వస్తువులు, సరికొత్త డిజైన్‌లతో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని భారీగా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 50 స్టాల్స్ ఏర్పాటు చేసిన ఈ వస్త్ర ప్రదర్శనలో చీరాల, కుప్పడం, పట్టు చీరలు, మంగళగిరి పట్టు శారీస్, బ్లాక్ ప్రింట్ సిల్క్ శారీస్, ఫ్యాబ్రిక్స్, ఖాదీ దుస్తులు, పోచంపల్లి శారీస్, సల్వార్ సూట్స్‌తో పాటు కశ్మీర్ శాల్స్, కళాఖండాలు, హ్యాండీక్రాఫ్ట్స్ జ్యువెల్లరీ, పెయింటింగ్స్, జూట్ బ్యాగ్స్, క్రాకరీతో పాటు విభిన్నమైన వస్తువులు ప్రదర్శనలో కొలువుదీరాయని వివరించారు..

విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 21: విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలోనే ఉండాలని మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. విద్యతోనే మార్పు సాధ్యమన్నారు. విద్యారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక, ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ వుమెన్ సంయుక్త ఆధ్వర్యంలో 'విద్య, వైద్య రంగాలు – సవాళ్లు'అనే అంశంపై ఒకరోజు సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆకునూరి మురళి హాజరై మాట్లాడుతూ మనదేశంలో ప్రైమరీ పాఠశాలలపై ఇప్పటికీ ప్రభుత్వాలు, ప్రజలకు ఒక స్పష్టత లేదన్నారు. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచి శాస్త్రీయ ఆలోచనను పెంపొందించేలా పాఠ్యాంశాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. దీనికోసం ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.యూనివర్సిటీ స్థాయిలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు సైతం అశాస్త్రీయ పద్ధతులను పాటించడమేంటని ప్రశ్నించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ సమాజంలో పేదలకు సరైన న్యాయం అందడం లేదన్నారు. చట్టం ఒకటే అయినా అది అందరికీ సమానంగా అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు డాక్టర్ కోయ వెంకటేశ్వర్‌రావు, శ్రీనాథ్, వెంకటరమణారెడ్డి, జితేందర్, చెలిమెల రాజేశ్వరరావు, ప్రొఫెసర్ బీఎన్‌రెడ్డి, డాక్టర్ రమాదేవి, లింగస్వామి, రవీంద్రబాబు, భీమేశ్వర్, ఏఎంఎస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి. రజిని, ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సీరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

సికింద్రాబాద్,జూలై 21: వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ హేమ అన్నారు.శనివారం రాత్రి కురిసిన వర్షాలకు శ్రీనివాస్ నగర్ జలమండలి కార్యాలయం పక్కన భారీ చెట్టు పడిపోయింది విషయం తెలుసుకున్న కార్పొరేటర్ ఆదివారం డీఆర్ఎఫ్ టీంకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న డీఆర్ఎఫ్ టీం కూలిన చెట్టును తొలగింపజేసి ఇబ్బందులు లేకుండా చేశారు.

రోడ్ల పక్కన ఉన్న నిరాశ్రయులకు దుస్తులను అందజేస్తున్న స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్.- బన్సీలాల్‌పేట